సాక్షి కామారెడ్డి

బుధవారం । 21 । జూన్ । 2023



గ్రంథాలయాలతోనే విజ్ఞానం

లైబ్రరీలు విజ్ఞాన భాండాగారాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ పున్న రాజేశ్వర్ పేర్కొన్నారు. భూంపల్లిలో లైబ్రరీని ప్రారంభించారు.

- 9లో ▸



కాంగ్రెస్‌కు అధికారమివ్వండి..

కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇస్తే సబ్సిడీపై రూ.500కే వంట గ్యాస్ సిలిండర్ ఇస్తామని బాన్సువాడ ఇన్‌చార్జి బాల్‌రాజు పేర్కొన్నారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
39.9 /29.5

వాతావరణం

ఉదయం నుంచి ఎండ తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. సాయంత్రం ఆకాశం మేఘావృతం కావచ్చు.

న్యూస్‌రీల్

నేడు నిజాంసాగర్ ప్రాజెక్ట్ నీటి విడుదల



నిజాంసాగర్ (జుక్కల్) : వానాకాలం వరి పంటల సాగు కోసం నిజాంసాగర్ ప్రాజెక్ట్ నీటిని మంగళవారం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే చేతుల మీదుగా విడుదల చేయనున్నారు. నిజాంసాగర్ ఆయకట్టు కింద లక్ష 15 వేల ఎకరాల్లో పంటలు సాగు చేస్తుండగా వాటి కోసం ప్రాజెక్ట్ నుంచి ప్రధాన కాలువకు మంగళవారం ఉదయం 6 గంటలకు నీటిని విడుదల చేస్తారని నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాస్ తెలిపారు.

జిల్లా సరిహద్దులో పోలీస్ చెక్‌పోస్ట్ ఏర్పాటు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : బక్రీద్ పండుగను పురస్కరించుకొని గోవుల అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లా సరిహద్దులో నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం వద్ద పోలీసులు మంగళవారం చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. జిల్లాను దాటి మెదక్ జిల్లాలోకి ప్రవేశించే ప్రతివాహనాన్ని వారు క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఈనెల 29వ తేదీ వరకు సరిహద్దులో చెక్‌పోస్ట్ కొనసాగుతుందన్నారు. కాగా ఎల్లారెడ్డి సర్కిల్ పరిధిలోని నాగిరెడ్డిపేట, లింగంపేట, ఎల్లారెడ్డి మండలాలకు చెందిన పోలీస్ సిబ్బంది చెక్‌పోస్ట్ వద్ద విధులు నిర్వహించనున్నారు.

హెచ్‌ఎంపై స్పీకర్ ఆగ్రహం



బాన్సువాడ : బీర్కూర్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సులోచనపై స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యా దినోత్సవంలో భాగంగా మంగళవారం ప్రాథమిక పాఠశాల అదనపు తరగతి గదులను ప్రారంభించిన అనంతరం తరగతిలోకి కలెక్టర్ జితేష్ వి పాటిల్‌తో కలిసి స్పీకర్ పోచారం వెళ్లారు. అక్కడ ఉన్న హెచ్‌ఎం సులోచనను పిలిచి పాఠశాలలో ఎంతమంది విద్యార్థులు ఉన్నారు. ఒక్కో తరగతికి ఎంతమంది విద్యార్థులు ఉండాల ని అడగగా సరైన సమాధానం చెప్పకపోవడంతో స్పీకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ. కోట్లు వెచ్చించి పాఠశాలలు కట్టిస్తే మీ పాఠశాలలో ఉండే విద్యార్థుల సంఖ్య కూడా మీకు తెలియక పోవడం ఏమిటని ప్రశ్నించారు. స్పీకర్‌కే హెచ్‌ఎం ఎదురు ప్రశ్నలు వేయడంతో స్పీకర్, కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజుల సొమ్ము రాళ్ల పాలు అనేలా తయా రైందని కోపంతో ఆయన అక్కడి నుంచి వెళ్లిపోయారు.

శక్తి కేంద్రాల్లో యోగా



కామారెడ్డి టౌన్ : అంతర్జాతీయ యోగా డే సందర్భంగా బుధవారం ప్రతి శక్తి కేంద్రంలో యోగా కార్యక్రమాలు నిర్వహించాలని బీజేపీ అసెంబ్లీ ఇంచార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి కోరారు. మంగళవారం కామారెడ్డిలోని ఆయన నివాసంలో మాట్లాడుతూ గురువారం ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మోతూరి శ్రీకాంత్, నరేందర్, శ్రీనివాస్, రవి, ప్రవీణ్, అన్నమండ్ల సురేష్, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఊళ్లన్నీ ఉక్కిరిబిక్కిరి!

- కాలుష్యం వెదజల్లుతున్న పరిశ్రమలు
- రోగాలతో జనం అవస్థలు
- ఆందోళనలకు దిగుతున్న ప్రజలు

సాక్షి, కామారెడ్డి / భిక్కనూరు : కాలుష్యం కోరలు చాస్తోంది. పీల్చే గాలి, తాగేనీరు కలుషితమవుతోంది. జనం రోగాల బారిన పడుతున్నారు. విషవాయువులు పల్లెల్ని కమ్మేస్తుండడంతో భరించలేకపోతున్నారు. తమ ప్రాంతానికి పరిశ్రమలు వస్తే ఉపాధి దొరుకుతుందని ఆశించిన ప్రజలకు ఉపాధి ఏమోగాని రోగాలు వెన్నాడుతున్నాయి. కాలుష్యకారక పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలంటూ పలుచోట్ల ప్రజలు ఆందోళనలకు దిగుతున్నారు. 44వ నంబరు జాతీయ రహదారిపై ఉన్న భిక్కనూరు మండలంలోని పెద్దమల్లారెడ్డి, కాచాపూర్, భిక్కనూరు, జంగంపల్లి, తలమడ్ల, తదితర గ్రామాల పరిసరాల్లో ఫార్మా, కెమికల్ ఇండస్ట్రీస్‌తో పాటు ఇతర పరిశ్రమలు, కోళ్ల ఫారాలు ఏర్పాటయ్యాయి. అయితే పరిశ్రమల నుంచి విడుదలయ్యే వ్యర్థాల మూలంగా దుర్వాసనతో ముక్కుపుటాలు అదిరిపోతున్నాయని వివిధ గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. పరిశ్రమల నుంచి వదిలే వ్యర్థాలతో చెరువుల్లోని నీరు కలుషితమవుతోందని, ఆఖరుకు భూగర్భజలాలు కూడా దెబ్బతిని ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భిక్కనూరు మండల కేంద్రం పరిధిలో నెలకొల్పిన ఓ ఫార్మా కంపెనీతో తాము అనేక కష్టాలు ఎదుర్కొంటున్నామని పేర్కొంటూ కాచాపూర్ గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గడిచిన 57 రోజులుగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ ఆందోళనలకు పొరుగున ఉన్న పెద్దమల్లారెడ్డి, అయ్యవారిపల్లి, సంగమేశ్వర్, మాందాపూర్, అంతంపల్లి తదితర గ్రామాల ప్రజలు కూడా సంఘీభావం తెలిపారు. వ్యర్థాలతో తామూ ఇబ్బంది పడుతున్నామని పేర్కొంటూ వారితో జతకలిశారు. అలాగే ఫ్యాక్టరీల నుంచి విడుదలయ్యే వ్యర్థాలతో భూగర్భజలాలు కూడా కలుషితమై, ఆ నీళ్లు తాగిన వారంతా ఇబ్బంది పడుతున్నారని పేర్కొంటున్నారు. కొన్నిచోట్ల వ్యర్థాలన్నీ పంట చేలగుండా కాలువలు, వాగుల్లోకి చేరి నీరు కలుషితమవుతోంది. గతంలో చెరువులోకి వ్యర్థాలు వెళ్లడంతో చేపలు మృత్యువాత పడ్డాయి.



భిక్కనూరులో ఫ్యాక్టరీ ఎదుట ధర్నాకు దిగిన గ్రామస్తులతో మాట్లాడుతున్న ఫ్యాక్టరీ ప్రతినిధి రవీందర్ రెడ్డి

మొక్కుబడి తనిఖీలు..

పరిశ్రమలను ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాల్సిన పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (పీసీబీ) అధికారులు మొక్కుబడి తనిఖీలతో చేతులు దులుపుకుంటున్నారని వివిధ గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఫార్మా కంపెనీ మూలంగా తాము పడుతున్న ఇబ్బందులపై 57 రోజులుగా ఆందోళనలు చేస్తున్నా పీసీబీ అధికారులు ఇటువైపు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 44వ నంబరు జాతీయ రహదారిపై భిక్కనూరు మండలంలో అడుగుపెట్టగానే ఆయా పరిశ్రమల నుంచి వెలుబడుతున్న వాసనలతో వాహనదారులు కూడా ఇబ్బంది పడుతున్నారు. కార్లు, ఇతర వాహనాల అద్దాలన్నీ మూసి ఉంచినా దుర్గంధంతో ముక్కుపుటాలు అదిరిపోతున్నాయని పలువురు పేర్కొంటున్నారు.

ఫ్యాక్టరీ ఎదుట ఉద్రిక్తత..

భిక్కనూరు : మండల సమీపంలోని ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీని మంగళవారం వివిధ గ్రామాల ప్రజలు ముట్టడించడంతో ఉద్రిక్తత నెలకొంది. ఫ్యాక్టరీ ప్రతినిధి రవీందర్‌రెడ్డి 2020లో కాచాపూర్ చెరువులో ఫ్యాక్టరీ వ్యర్థాల కారణంగా చేపలు చనిపోగా పరిష్కారం కోసం ఏడు అంశాలపై లిఖితపూర్వకంగా రాసిచ్చి అమలు చేయలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. భిక్కనూరు సీఐ తిరుపయ్యతో పాటు, ఎస్సై ఆనంద్‌గౌడ్, హైమద్, దోమకొండ బీబీపేట, మాచారెడ్డి, రాజంపేట ఎస్సైలు సాయికుమార్, సుధాకర్, విజయకుమార్, రాజు సంతోశ్, ఆర్ఎస్ఐ సుభాశ్‌తో పాటు పోలీస్‌లు బందోబస్తును నిర్వహించారు. కామారెడ్డి అడిషనల్ ఎస్పీ అన్యోన్య వచ్చి ప్రజలతో మాట్లాడారు. బీఎస్పీ కామారెడ్డి నియోజకవర్గ ఇంచార్జీ శ్రీధర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్రనాయకుడు చందు, బీజేపీ కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రభావం..

భిక్కనూరు, జంగంపల్లి గ్రామాల పరిధిలోని ఫార్మా, కెమికల్ ఫ్యాక్టరీలతో పాటు ఇతర ఫ్యాక్టరీల నుంచి వెదజల్లుతున్న విష వాయువులతో ఆయా గ్రామాలతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు రకరకాల రోగాలబారిన పడుతున్నారు. ముఖ్యంగా చర్మ వ్యాధు లు ఎక్కువ మందిని ఇబ్బంది పెడుతున్నా యి. దురద, దద్దుర్లు వస్తున్నాయని చెబుతున్నారు. అలాగే గొంతునొప్పి, కడుపునొప్పి వంటి సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. తలమడ్ల, జంగంపల్లి గ్రామాల శివార్లలో ఉన్న పౌల్ట్రీ ఫాంల నుంచి దుర్వాసన వెదజల్లడంతో పాటు పెద్దపెద్ద ఈగలు ఊళ్లను చుట్టేస్తున్నాయి. పెద్దఈగలు ఇళ్లల్లోకి చేరి ఇబ్బంది పెడుతున్నాయి. అన్నం తినాలంటే ఆ ఈగలు పళ్లెం చుట్టూ తిరుగుతాయని తలమడ్ల గ్రామస్తులు పేర్కొంటున్నారు.



మాట్లాడుతున్న వీడీసీ చైర్మన్ మైపాల్

ఇక్కడ నీళ్లు తాగలేకపోతున్నాం..



బోర్లలో నుంచి వచ్చే నీళ్లన్నీ కలుషితమయ్యాయి. వాటిని ఇక్కడ ఫిల్టర్ చేసినా తాగలేకపోతున్నాం. పొరుగు ఊళ్ల నుంచి మినరల్ వాటర్ బబుల్స్ తెప్పించుకుని తాగుతున్నాం. ఫ్యాక్టరీలతో చాలా ఇబ్బందులున్నాయి. కాలుష్యం వెదజల్లకుండా చర్యలు తీసుకోవాలి. - మోతె కిష్టారెడ్డి, కాచాపూర్

ఎన్నో అవస్థలు పడుతున్నం..



ఇంట్ల నుంచి కాలు బయట పెడితే వాసన భరించలేకపోతున్నం. మా ఊళ్లో అందరూ ఏదో ఒక రోగంతో అవస్థలు పడుతున్నం. నీళ్లు తాగాలంటే భయపడిపోతున్నం. ఎవలూ పట్టించుకుంటలేరు. ఫ్యాక్టరీ నుంచి వస్తున్న వాసనతో మస్తు ఇబ్బంది పడుతున్నం. - భారతి, కాచాపూర్

పరిష్కారమయ్యేవరకు పోరాటం



ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీ వల్ల ప్రాణాలు పోతున్నాయి. మూడేళ్ల క్రితం ఇచ్చిన ఏ ఒక్కహామీని కూడా ఎంఎస్ఎన్ యాజమాన్యం నెరవేర్చలేదు. సమస్య పూర్తిగా పరిష్కారం అయ్యే వరకు పోరాడుతాం. రాజకీయ నేతలు కుట్రలను సహించం. మండలంలోని 18 గ్రామాలతో ఉద్యమాన్ని కొనసాగిస్తాం. - మైపాల్ వీడీసీ అధ్యక్షుడు కాచాపూర్

రూ.లక్ష సాయం కోసం..

- జిల్లాలో 16,085 మంది దరఖాస్తు
- ముగిసిన గడువు, చాలామంది బీసీ కులవృత్తిదారులకు నిరాశ

సాక్షి, కామారెడ్డి : బీసీ కులాలకు చెందిన కులవృత్తుల వారికి తమ వృత్తిని అభివృద్ధి చేసుకోవడం కోసం ప్రభుత్వం రూ. లక్ష సాయం అందించేందుకు చేపట్టిన దరఖాస్తుల స్వీకరణ గడువు మంగళవారం సాయంత్రంతో ముగిసింది. జిల్లాలో ఈ స్కీం కోసం 16,085 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈనెల 6వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ మొదలైంది. కులవృత్తులు, చేతి వృత్తులకు సంబంధించి 15 కులాల వారికి రూ.లక్ష చొప్పున సాయం అందించేందుకు ఉద్దేశించిన ఈ పథకం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. అయితే కుల, ఆదాయ ధృవ పత్రాలు సకాలంలో జారీ కాకపోవడంతో చాలా మంది రోజుల తరబడిగా తహశీల్ కార్యాలయాల చుట్టూ తిరిగారు. పలు చోట్ల ఆందోళనలకు దిగారు. రేషన్ కార్డు, కుల, ఆదాయ ధ్రువపత్రాలు, ఆధార్ కార్డులతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆదేశించింది. కుల, ఆదాయ ధ్రువపత్రాల జారీలో దళారులు దండుకున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి. కాగా దరఖాస్తు చేసుకున్న వారిలో ఎంత మందికి రూ.లక్ష సాయం అందుతుందన్నదానిపై క్లారిటీ లేదు. సర్టిఫికెట్లు సకాలంలో దొరక్క దరఖాస్తు చేసుకోలేకపోయిన వారు ఆవేదన చెందుతున్నారు.

రామారెడ్డి కళాశాల విద్యార్థులకు అవార్డులు



అవార్డు అందుకుంటున్న విద్యార్థిని శ్రీజ

రామారెడ్డి : తెలంగాణ దశాబ్ది వేడుకలో భాగంగా ఇంటర్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల రామారెడ్డి 2021–23లో కళాశాల టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులను మంగళవారం విద్యా దినోత్సవంలో భాగంగా కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్ అందజేశారు. కళాశాలలో శ్రీజ బైపీసీ సెకండియర్ 967 మార్కులు, రెండో టాపర్‌గా నిలిచిన రాజేందర్ బైపీసీ (952) సాధించారు. ఈ సందర్భంగా ప్రిన్స్‌పాల్ మధు శ్రీవాత్సవ, అధ్యాపక బృందం హర్షం వ్యక్తం చేశారు.

కాజేసిన సొమ్ము తిరిగి ఇప్పించండి..



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న డ్వాక్రా మహిళలు

కలెక్టరేట్‌కు తరలివచ్చిన డ్వాక్రా మహిళలు

కామారెడ్డి క్రైం : ఐకేపీ సీఏ కాజేసిన డబ్బులను తిరిగి ఇప్పించాలని డిమాండ్ చేస్తూ తాడ్వాయి మండలం నందివాడ గ్రామానికి చెందిన మహిళలు పెద్దఎత్తున మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌కు తరలివచ్చారు. కలెక్టరేట్‌ను ముట్టడించి కార్యాలయం ఎదుట బైఠాయించారు. వారు మాట్లాడుతూ.. గ్రామంలోని 26 పొదుపు సంఘాల గ్రూప్‌లకు సంబంధించిన రూ. 36 లక్షలను సీఏ బాబాగౌడ్ తన అకౌంట్లో జమ చేసుకొని తిరిగి ఇవ్వడం లేదన్నారు. విషయం వెలుగులోకి వచ్చిన తర్వాత అధికారులు గ్రామానికి వచ్చి అతడిపై చర్యలు తీసుకుంటామని, డబ్బులు తిరిగి వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అయినప్పటికీ బాబాగౌడ్ మహిళా సంఘాలకు చెందిన డబ్బులను తిరిగి ఇవ్వడం లేదని, అడిగితే బెదిరిస్తున్నాడన్నారు. తమకు డబ్బులు తిరిగి ఇప్పించాలని కలెక్టరేట్ ఎదుట గంట పాటు ధర్నా చేశారు. పోలీసులు వారికి సర్ది చెప్పారు. అనంతరం మహిళా సంఘాలకు చెందిన ప్రతినిధులు కార్యాలయంలో పలికి వెళ్లి కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను కలిశారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.

విద్యావంతుల సమాజం తయారు కావాలి

- రాష్ట్ర బడ్జెట్‌లో విద్యాశాఖకు రూ.19,093 కోట్లు
- బీర్కూర్‌లో విద్యాదినోత్సవంలో స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి

బాన్సువాడ : సమాజం విద్యావంతుల సమాజంగా తయారు కావాలని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం బీర్కూర్ మండల కేంద్రంలోని జిల్లా ఉన్నత పాఠశాలలో విద్యా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ బాన్సువాడ మండలం రాంపూర్‌లో ఓ గుడిసె పాఠశాలలో 1వ తరగతి చదివానని, ఇబ్రహీంపేట్‌లో 2వ తరగతి నుంచి 5వ తరగతి వరకు చదువుకున్నానని, పైనుంచి మిడతలు పడేవని స్పీకర్ గుర్తు చేశారు. 1994లో తాను మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచినప్పుడు బాన్సువాడలో ఒకే ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉండేదని, ప్రస్తుతం 30 కళాశాలలు ఉన్నాయని, బీఎస్సీ నర్సింగ్ కాలేజ్, ఉర్దూమీడియం డిగ్రీ కళాశాల ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 26 నుంచి రైతుల ఖాతాల్లో రైతుబంధు నిధులు జమ చేయనున్నట్లు స్పీకర్ అన్నారు. నేడు నిజాంసాగర్ నీటిని విడుదల చేస్తున్నామన్నారు. ప్రస్తుతం నిజాంసాగర్‌లో 5 టీఎంసీల నీరుందని, సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తే మరో 5 టీఎంసీల నీటిని కొండపోచమ్మ ప్రాజెక్ట్ నుంచి ఇస్తామన్నారన్నారు.

మన ఊరు–మన బడితో మారిన రూపురేఖలు

మన ఊరు–మన బడి పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. తాను కలెక్టర్ అయినా ఇంకా చదువుతూనే ఉన్నానన్నారు. బీర్కూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా రూ.1.61 కోట్లతో నిర్మించిన 12 అదనపు తరగతి గదులను కలెక్టర్ జితేష్ వి. పాటిల్‌తో కలిసి స్పీకర్ పోచారం ప్రారంభించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రూ.92.83 కోట్లతో మౌలిక వసతులు, 7 అదనపు తరగతి గదులు, రూ.33 లక్షలతో ఉర్దూమీడియం స్కూల్‌లో 3 అదనపు తరగతి గదులు, రూ.27 లక్షలతో 3 అంగన్‌వాడీ కేంద్రాలను ప్రారంభించారు. నాయకులు పోచారం సురేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ స్వరూప, ఎంపీపీ రఘు, వైస్ ఎంపీపీ కాశీరాం, ఎంఈవో నాగేశ్వర్‌రావు, ఏఎంసీ చైర్మన్ ద్రోణవల్లి అశోక్, మాజీ జెడ్పీటీసీ ద్రోణవల్లి సతీష్, ఎంపీటీసీ సందీప్ తదితరులున్నారు.

సోది చెబుతానయ్య సోది..

బాన్సువాడ : సోది చెబుతానమ్మ.. సోది చెబుతా.. జరిగింది చెబుతా.. జరగబోయేది చెబుతా.. ఉన్నది ఉన్నట్లు చెబుతా.. అంటూ ఓ విద్యార్థిని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి సోది చెప్పింది. మంగళవారం బీర్కూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యా దినోత్సవం నిర్వహించారు. పదో తరగతి చదువుతున్న సౌమ్య అనే విద్యార్థిని సోదమ్మ వేషధారణతో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డితో సోది చెబుతానయ్యా.. నీ భవిష్యత్ చెబుతానయ్యా.. అనడంతో స్పీకర్ చెయ్యిచ్చారు. వయస్సు మీదపడ్డా గాని పోరనోళ్ల తిరుగుతావయ్యా.. గరీబోళ్లకు ఇళ్లు కట్టించి దేవుడవయ్యావయ్యా.. బడులు కట్టించి భవిష్యత్ తరాలకు బాసటవయ్యావయ్యా.. రోడ్లు పెద్దగా చేయించి గిర్రున వెళ్లేటట్లు చేసితివయ్యా.. వచ్చే ఎన్నికల్లో లక్ష కంటే ఎక్కువ ఓట్లు పడతాయయ్యా.. అంటూ స్పీకర్‌కు విద్యార్థిని సోది చెప్పడంతో స్పీకర్ కళ్లలో ఆనందభాష్పాలు వచ్చాయి. విద్యార్థిని చెప్పిన సోదికి మిగితా విద్యార్థులు చప్పట్లు కొట్టారు. స్పీకర్ సౌమ్యకు సన్మానించారు.



స్పీకర్‌కు సోది చెబుతున్న విద్యార్థిని సౌమ్య

అప్పట్లో ఇన్ని సౌకర్యాల్లేవ్..

మద్నూర్(జుక్కల్) : మేము చదువుకునే రోజుల్లో ఎలాంటి సౌకర్యాలు లేవని ప్రస్తుతం రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థుల కోసం అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని ఎమ్మెల్యే హన్మంత్‌సింధే తెలిపారు. మండలంలోని పెద్ద ఎక్లార గేటు వద్ద సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో నూతనంగా నిర్మించిన అదనపు గదులకు మంగళవారం ఎమ్మెల్యే హన్మంత్‌సింధే ప్రారంభించారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గురుకుల పాఠశాలలో తెలంగాణ విద్యా దినోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేశారు.

పాఠశాల, కళాశాలలో మొత్తం ఏడు క్వార్టర్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. నేను మద్నూర్‌లోని హాస్టల్‌లో ఉంటూ చదువుకున్నానని అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ఎమ్మెల్యే సందర్శించారు. జెడ్పీ సీఈవో సాయాగౌడ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బస్సీపటేల్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సురేశ్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్



పెద్ద ఎక్లారలో నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే సింధే

ప్రైవేట్‌కు దీటుగా సర్కారు స్కూళ్లు..

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు రూపుదిద్దుకున్నాయని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. మంగళవారం తాడ్వాయి మండలంలోని కృష్ణాజివాడి ప్రభుత్వ పాఠశాలలో మన ఊరు–మన బడికి సంబంధించిన పాఠశాలను ప్రారంభించారు. కామారెడ్డిలో 1011 మన ఊరు–మన బడి పాఠశాలలకు గాను ఎల్లారెడ్డి నియోజక వర్గంలోనే 128 పాఠశాలలు మంజూరు అయ్యాయన్నారు. కృష్ణాజివాడి గ్రామానికి రూ. కోటి 50 లక్షలతో పనులు చేశామన్నారు. అంతే కాకుండా రూ. 5లక్షలతో మహిళా సంఘం, రూ. 10 లక్షలతో కమ్యూనిటీ హాల్ తదితర పనులు చేశామన్నారు. రూ. 10 లక్షలతో బీసీ కాలనీలో సీసీరోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానన్నారు. కృష్ణావాడిలో మన ఊరు–మనబడి పాఠశాల మంజూర్ కావడం ఇక్కడి విద్యార్థుల అదృష్టమన్నారు. డీఈవో రాజు, సర్పంచ్ భూషణం, ఎంపీపీ కొడిరవి, వైస్ఎంపీపీ నర్సింలు, జెడ్పీటీసీ రమాదేవి, పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిరెడ్డి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సంజీవులు, డీసీఎంఎస్ డైరెక్టర్ కపిల్‌రెడ్డి, ఎంపీడీవో రాజ్‌వీర్, ఎంఈవో రామస్వామి తదితరులున్నారు.

విద్యతోనే విజ్ఞానం, వికాసం

- జెడ్పీ చైర్‌పర్సన్ శోభ
- పలువురు దాతలకు సన్మానం

కామారెడ్డి క్రైం : విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని జెడ్పీ చైర్‌పర్సన్ శోభ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో బుధవారం డీఈవో ఆధ్వర్యంలో విద్యా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు నేడు విద్యాబోధన చేస్తున్నారని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

పాఠశాలల్లో ఆధునిక సౌకర్యాలు..

మన ఊరు మన బడి కార్యక్రమం కింద ఆధునిక సౌకర్యాలతో పాఠశాల భవనాలు నిర్మించినట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. 12 అంశాలలో మార్పు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రీడింగ్ రూం, లైబ్రరీ, డిజిటల్ తరగతి గదులు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పాఠశాలల అభివృద్ధికి విరాళాలు ఇచ్చిన దాతలను అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాళ్లను జెడ్పీ చైర్‌పర్సన్ శోభ సందర్శించారు. విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పదవ తరగతిలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు, ఉత్తమ ఫలితాలు సాధించిన పాఠశాలల హెచ్‌ఎంకు, దాతలకు ఈ సందర్భంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ప్రేం కుమార్, డీఈవో రాజు, దోమకొండ జెడ్పీటీసీ తిరుమల్ గౌడ్, బీబీపేట ఎంపీపీ బాలమణి, ఎంఈవోలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రం అందజేస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ శోభ

క్లుప్తంగా

2న పద్మశాలి విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు

నిజామాబాద్‌నాగారం: జిల్లా నగర పద్మశాలి సంఘం, పద్మశాలి ఆత్మీయ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో అత్యధిక మార్కులు పొందిన పద్మశాలి విద్యార్థులకు జులై 2న ప్రతిభ పురస్కారాలు అందజేయనున్నట్లు జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు దీకొండ యాదగిరి ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని న్యూఅంబేడ్కర్ భవన్‌లో జులై 2న మధ్యాహ్నం 3గంటలకు పురస్కారాలు అందజేస్తామన్నారు. అర్హులైన విద్యార్థులు 2022–23 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్ చదివిన పద్మశాలి విద్యార్థుల మార్కుల జాబితా, ఆధార్‌కార్డు, కులధృవీకరణ పత్రాల జిరాక్స్ కాపీలతో ఈనెల 25 లోగా సంఘ బాధ్యులకు అందజేయలన్నారు. సంఘ బాధ్యులు పుల్గం హన్మాండ్లు–93964 83999, వెంకట నర్సయ్య–9985566374, రాపెల్లి గురుచరణం–9866557115, గుడ్ల భూమేష్–9494258585కు విద్యార్థులు సంబంధిత పత్రాలను అందజేయలన్నారు.

ఓపెన్ ప్లాట్ విక్రయించిన వ్యక్తిపై కేసు

కామారెడ్డి క్రైం/కామారెడ్డి టౌన్: వెంచర్ చేసినప్పుడు ప్రభుత్వ అవసరాలకు వదిలేసిన ఓపెన్ ప్లాట్‌ను అక్రమంగా విక్రయించిన ఓ వ్యక్తిపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. భిక్కనూరు మండలం జంగంపల్లి గ్రామానికి చెందిన ఎండి ఇస్మాయిల్ కామారెడ్డిలోని గాంధీనగర్‌లో చేసిన ఓ వెంచర్‌లో 500 గజాల ప్లాటును 2019లో కామారెడ్డి పట్టణానికి చెందిన మహమ్మద్ సబ్జార్ వద్ద కొనుగోలు చేశాడు. ఇటీవల ఇంటి నిర్మాణానికి అనుమతి కోసం మున్సిపల్ వారిని సంప్రదించగా సదరు ప్లాటు వెంచర్‌లో భాగంగా మున్సిపల్‌కు వదిలేసిన ఓపెన్ స్థలం అని చెప్పారు. దీంతో వెంచర్ యజమానిని ప్రశ్నించగా మరో ప్లాటు ఇప్పిస్తానని కొద్ది రోజులుగా మాయ మాటలు చెప్పి మోసం చేస్తున్నాడని బాధితుడు మంగళవారం పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్‌హెచ్‌ఓ నరేష్ తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులకు సన్మానం



రుద్రూర్: ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో మోస్రా మండలం గోవూర్ హైస్కూల్ విద్యార్థులు ప్రత్యూష, మధుర, దీక్షిత ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు ఎస్‌ఎంసీ చైర్మన్ నన్నే సాబ్ పేర్కొన్నారు. ఈసందర్భంగా మంగళవారం పాఠశాల విద్యా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వారిని సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థినులకు చదువుతోపాటు ఆత్మరక్షణ కోసం కరాటే లాంటి శిక్షణ అవసరమని అన్నారు. హెచ్‌ఎం రవీందర్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెండోరోజు కొనసాగిన చండీయాగం



నిజామాబాద్ సిటీ: నగరంలోని బస్వాగార్డెన్‌లో మంగళవారం రెండోరోజు మహా చండీయాగం కొనసాగింది. యాగంలో జిల్లా జడ్జి సునీత కుంచాల పాల్గొనగా, నిర్వాహకులు సంతోష్‌శర్మ జడ్జికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా సత్యనారాయణ వ్రతం చేశారు. యాగంలో పాల్గొనటం తనకు ఎంతో సంతృప్తినిచ్చినట్లు జడ్జి పేర్కొన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. రేపు మధ్యాహ్నం పూర్ణహుతి కార్యక్రమంతో చండీయాగం కార్యక్రమం ముగుస్తుందని సంతోష్‌శర్మ తెలిపారు.

పోలీసుల్లో రాజకీయ బదిలీలు

- ప్రజాప్రతినిధుల మధ్య సఖ్యత లేకపోవడంతో సిబ్బందికి ఇబ్బందులు
- ఫిబ్రవరి నుంచి కొనసాగుతున్న బదిలీల ప్రక్రియ



ఖలీల్‌వాడి: నిజామాబాద్ జిల్లాలో పోలీసుల బదిలీలకు రాజకీయ రంగు పట్టుకుంది. జిల్లాలో ప్రజాప్రతినిధుల మధ్య సఖ్యత లేకపోవడంతో పోలీసులకు తలనొప్పిగా మారింది. నియోజకవర్గం ప్రజాప్రతినిధి అనుగ్రహం ఉన్నా, బదిలీ ఎప్పుడు జరుగుతుందోనని ఎస్సైలు, సీఐలు ఆందోళన చెందుతున్నారు. ఫిబ్రవరిలో నిజామాబాద్ ఏసీపీగా పని చేసిన వెంకటేశ్వర్ రెండేళ్లు కాకుండానే బదిలీపై వెళ్లడంతో అప్పుడు పోలీస్‌వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రజాప్రతినిధులు ఇచ్చిన సిఫార్సు లేఖలతో వచ్చినా పూర్తికాలం పని చేస్తామా లేదా అనే సందేహాలు ఉన్నాయి. గత కొంతకాలంగా నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎస్సైలు, సీఐలు, ఏసీపీల బదిలీలు పరంపర కొనసాగుతునే ఉన్నాయి. పోలీస్‌శాఖలో రాజకీయరంగు పులుమడంతో జిల్లాలో పోలీసులకు గుర్తింపు లేకుండాపోతుంది. జిల్లా పోలీస్‌శాఖలో ఎస్సైలు, సీఐలను కొందరు ప్రజాప్రతినిధులు తమకు నచ్చిన ప్రాంతాలకు బదిలీ చేసుకునేందుకు సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది. కమిషనరేట్ పరిధిలో ఎన్నికల బదిలీలు ఉండగా జిల్లాకు కొన్ని రోజుల క్రితం వచ్చిన సీఐలు బదిలీలు కావడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

ప్రజాప్రతినిధిని కలిస్తే చాలు..

జిల్లాలో ప్రజాప్రతినిధుల మధ్య సఖ్యత లేకపోవడంతో బదిలీల ప్రక్రియ కొనసాగుతుంది. ప్రజాప్రతినిధులు జరిగే కార్యక్రమాలకు పోలీసులు భద్రత కల్పించాల్సి ఉంటుంది. దీంతో పోలీసులు తమ ప్రాంతంలోని ప్రజాప్రతినిధులకు కాకుండా వేరే నియోజకవర్గ ప్రతినిధిని కలిస్తే చాలు ఆ పోలీస్ అధికారి పోస్టు ఉంటుందా? ఊడుతుందా? అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

తాజాగా ఇలాంటి ఘటన నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఉన్న పోలీస్ అధికారికి చోటుచేసుకుంది. సదరు అధికారికి పోస్టింగ్ ఉత్తర్వులు వచ్చే వరకు తెలియకపోవడం శోచనీయం. ఈ పోలీస్ అధికారి పరిధిలో మూడు ప్రాంతాలకు చెందిన ప్రజాప్రతినిధులు ఉంటారు. ఓ కార్యక్రమంలో సదరు ప్రజాప్రతినిధి వచ్చిన సమయంలో భద్రత కల్పించడంతో వారం తర్వాత బదిలీ వెలువడటం కొసమెరుపు. ఈక్రమంలో ఫిబ్రవరి నుంచి ఏసీపీతోపాటు సీఐ పలువురు బదిలీ అయ్యారు.

ఎన్నికల కోసమే..

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో పోలీసుశాఖలో బదిలీలు జరుగుతాయనే చర్చ జరుగుతుంది. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో తమకు అనుకూలంగా ఉన్నవారి కోసం పోస్టింగ్ తెచ్చుకునేందుకు ప్రజాప్రతినిధులు పావులు కదుపుతున్నారు. ప్రజాప్రతినిధుల మధ్య సఖ్యత లేకపోవడం, తమకు సహకరించడం లేదనే సాకుతో బదిలీలు చేయడం జిల్లాలో కొనసాగుతునే ఉంది. కానీ పోలీస్‌శాఖ బదిలీల్లో రాజకీయ నేతలు జోక్యం చేసుకోవడంతో పోలీసులు పనిచేయడంలో ఆసక్తి తగ్గినట్లు తెలుస్తోంది. జిల్లాలో ఇప్పటికే జిల్లా పోలీస్‌కమిషనర్ పోస్టు ఖాళీగా ఉంది. ఈక్రమంలో వచ్చే నెలలో పోలీస్‌శాఖలో బదిలీలు జరుగుతాయనే చర్చ కొనసాగుతోంది.

జుక్కల్ నియోజకవర్గానికి రూ.32 కోట్ల నిధులు

- రోడ్ల విస్తరణ, సెంట్రల్ లైటింగ్‌కు వినియోగం
- ఎమ్మెల్యే హన్మంత్‌సింధే



మద్నూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మద్నూర్(జుక్కల్): జుక్కల్ నియోజకవర్గంలోని మద్నూర్, జుక్కల్, పెద్ద కొడప్‌గల్, పిట్లం, నిజాంసాగర్ ఐదు మండలాలకు రూ.32 కోట్ల నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే హన్మంత్‌సింధే వెల్లడించారు. ఆయా మండలాల్లో నిధులను రోడ్డు వెడల్పు, సెంట్రల్ లైటింగ్ కోసం వినియోగించనున్నట్లు ఆయన తెలిపారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం సీఎం కేసీఆర్ నియోజకవర్గంలోని రోడ్ల అభివృద్ధికి రూ.335 కోట్లు మంజూరు చేశారని అన్నారు.

అతి త్వరలో డిగ్రీ కళాశాల..

మద్నూర్ మండల విద్యార్థులు, ప్రజలు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల అతి త్వరలో రాబోతుందని, దీంతో విద్యార్థుల కళ నెరవేరుతుందని ఎమ్మెల్యే హన్మంత్‌సింధే పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. మద్నూర్‌లో డిగ్రీ కళాశాల లేకపోవడంతో విద్యార్థులు ఎంతో ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మంజూరు కోసం తీవ్రంగా కృషి చేసినట్లు ఆయన అన్నారు. ఆలస్యం లేకుండా మండలానికి డిగ్రీ కళాశాల మంజూరు ఉత్తర్వులు త్వరలో వస్తాయని పేర్కొన్నారు. సెంట్రల్ లైటింగ్ మంజూరుతో బీఆర్‌ఎస్ నాయకులు టపాసులు కాల్చి ఆనందం వ్యక్తం చేశారు. నిధులు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యేను స్థానిక ప్రజాప్రతినిధులు సన్మానించారు. సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు సురేష్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బస్సీ పటేల్, ఆత్మకమిటీ చైర్మన్ గంగాధర్, ఉప సర్పంచ్ విఠల్, నాయకులు కంచిన్ హన్మండ్లు, పాకాల విజయ్, కుషాల్ తదితరులు ఉన్నారు.

ముగిసిన దరఖాస్తుల గడువు

నిజామాబాద్‌అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులవృత్తులకు అందించే ఆర్థికసాయానికి సంబంధించిన దరఖాస్తుల గడువు ముగిసింది. బీసీ కులవృత్తుదారులను ఆదుకోవడానికి గత కొన్ని రోజుల నుంచి ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరిస్తుండగా, మంగళవారంతో గడువు ముగిసింది. చివరిరోజు దరఖాస్తుదారులు పెద్దసంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. దీంతో మొత్తం 23,463 దరఖాస్తులు వచ్చినట్లు సంబంధిత శాఖ అధికారులు పేర్కొన్నారు. రాత్రి 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తు వివరాలను బీసీ సంక్షేమ శాఖ అధికారులు నమోదు చేసుకున్నారు.

ఘనంగా పూరి జగన్నాథయాత్ర



జగన్నాథయాత్రలో పాల్గొన్న భక్తులు



జగన్నాథుడి రథం

నిజామాబాద్ సిటీ: నగరంలో మంగళవారం ఇస్కాన్ ఆధ్వర్యంలో పూరిజగన్నాథ యాత్రను ఘనంగా నిర్వహించారు. మంగళవారం నగరానికి చేరుకున్న యాత్రను వినాయక్‌నగర్ హనుమాన్ జంక్షన్ వద్ద ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా ప్రారంభించారు. యాత్ర నగరంలోని పూలాంగ్ చౌరస్తా మీదుగా కొనసాగి దుబ్బాలోని మహేశ్వరీ భవన్‌కు చేరుకుంది. అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు కొనసాగాయి. మేయర్ నీతూకిరణ్, నుడా చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్ మల్లేష్, నాయకులు సుజిత్‌సింగ్, శ్రీనివాస్, సత్యప్రకాష్ పాల్గొన్నారు.

జిల్లాకు చుక్క నీరైనా ఇవ్వని రాష్ట్ర ప్రభుత్వం

- గుత్ప, అలీసాగర్ పథకాలు కాంగ్రెస్‌వే
- రాష్ట్ర కిసాన్ సెల్ అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి



మాట్లాడుతున్న అన్వేష్‌రెడ్డి.. పక్కన ముప్పగంగారెడ్డి, ఆదిరెడ్డి, తాహెర్‌బిన్‌హందాన్

ఖలీల్‌వాడి: తొమ్మిది ఏళ్లలో సీఎం కేసీఆర్, రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు చుక్కనీరు అందించలేదని రాష్ట్ర కిసాన్ సెల్ అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో మంగళవారం జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కిసాన్ కాంగ్రెస్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కిసాన్ కాంగ్రెస్ కమిటీ, మండల అధ్యక్షులను ప్రకటిస్తూ నియామక పత్రాలు అందించారు. అనంతరం అన్వేష్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాకు సాగు నీరు అందించడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. 21 ప్యాకేజీ ద్వారా గ్రావిటీ ద్వారా సాగు నీరు అందించే అవకాశం ఉన్నా, కమీషన్ల కోసం పైపు లైన్ ఏర్పాటు చేసి, ఇంత వరకు సాగునీరు అందించలేదన్నారు. కాంగ్రెస్ హయాంలో గుత్ప, అలీసాగర్ ఎత్తిపోతల పథకం నిర్మించామన్నారు. మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో సాగునీటిపై రైతులతో సమావేశాలు ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలో తరుగు పేరు మీద దోపిడీ జరిగితే మంత్రి, ఎమ్మెల్యేలు మౌనంగా ఉన్నారని, ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నించారు. అకాల వర్షాలతో పంట నష్టపోయినా ఇంత వరకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం పరిహారం అందించలేదన్నారు. రైతులకు ఇంతవరకు రుణమాఫీ చేయలేదన్నారు. ముప్ప గంగారెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో కిసాన్ కాంగ్రెస్ నాయకులు ప్రజల వద్దకు వెళ్లి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు చేసిన మోసాలను వివరించాలన్నారు. రాబోయే కాలంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే చేసే పనులను రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తుందని తెలిపారు. భూమిలేని ఉపాధి హామీ కూలీలకు రూ.12వేలు ప్రతియేటా అందిస్తామన్నారు. పీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్‌హందాన్, జిల్లా కిసాన్ సెల్ ఇన్‌ఛార్జి ఆదిరెడ్డి, కామారెడ్డి జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రేపు జిల్లాస్థాయి క్రికెట్ క్రీడాకారుల ఎంపిక పోటీలు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ మోడల్ స్కూల్ మైదానంలో ఈ నెల 22న జిల్లా స్థాయి క్రికెట్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. మోడల్ స్కూల్ మైదానంలో సాయంత్రం ఐదు గంటలకు నిర్వహించే ఎంపిక పోటీలకు క్రీడాకారులు సొంత క్రికెట్ కిట్, ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రాలు, డ్రెస్‌కోడ్‌తో హాజరు కావాలని సూచించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి అండర్ –19, అండర్–25 క్రికెట్ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్‌నెం: 8317595377ను సంప్రదించాలని సూచించారు.

కాంట్రాక్టు అధ్యాపకుల ర్యాలీ



సౌత్‌క్యాంపస్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు

భిక్కనూరు: ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తమ ఉద్యోగాలను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ సౌత్‌క్యాంపస్‌లో కాంట్రాక్టు అధ్యాపకులు మంగళవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాల్లోని యూనివర్సిటీల్లో కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేశారన్నారు. కానీ మన రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల్లో 1300 మంది కాంట్రాక్టు అధ్యాపకులు పనిచేస్తున్నారని, వారిని ఇంత వరకు రెగ్యులరైజ్ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ నారాయణగుప్త, ప్రతినిదులు యాలాద్రి, నర్సయ్య, రమాదేవి, వైశాలి, సునీత, శ్రీమాత, దిలీప్ పాల్గొన్నారు.

తెయూలో..

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం క్యాంపస్‌లోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ ఎదుట వారు ధర్నా నిర్వహించారు.

బీఈడీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి



తెయూ రిజిస్ట్రార్ యాదగిరికి వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌ఎస్‌యూఐ ప్రతినిధులు

తెయూ(డిచ్‌పల్లి): నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీటీఈ) నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న బీఈడీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వరదబట్టు వేణురాజ్ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వేణురాజ్ మాట్లాడుతూ.. బోధన్‌లోని సెయింట్ థామస్, శ్రీచైతన్య, మల్లారంలోని అయేషా, ఆర్మూర్‌లోని ప్రియదర్శిని బీఈడీ కళాశాలలు నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నాయన్నారు. ఎన్‌సీటీఈ నిబంధనల మేరకు ఉండాల్సిన మౌలిక వసతులు ఏ ఒక్క కళాశాలలో లేవన్నారు. అలాగే యూనివర్సిటీ అనుమతించిన సీట్ల పరిమితి కంటే అధిక సంఖ్యలో సీట్లు భర్తీ చేస్తున్నారని, విద్యాప్రమాణాలు పాటించకుండా కేవలం ధనార్జనే ధ్యేయంగా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. బీఈడీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని, ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. నాయకులు అష్రఫ్, నిఖిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సర్టిఫికెట్ల పరిశీలన



ఖలీల్‌వాడి: తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహిస్తున్న ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఆరో రోజు మంగళవారం కొనసాగింది. నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఇన్‌చార్జి పోలీస్ కమీషనర్ ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు డీసీపీ (ఏఆర్) గిరిరాజు ఆధ్వర్యంలో సర్టిఫికేట్ వెరిఫికేషన్ నిర్వహించారు. 608 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా, అందులో 536 హాజరు కాగ, 72 మంది గైర్హాజరయ్యారు. ఏవో శ్రీనివాస్, ఆఫీస్ సూపరింటెండెంట్‌లు శంకర్, హైమద్, తదితరులు ఉన్నారు.

ఉత్తమ జీపీ సర్పంచ్‌కు అవార్డు



ఉప ముఖ్యమంత్రి సమక్షంలో అవార్డు అందుకుంటున్న సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): సదాశివనగర్ గ్రామ పంచాయతీ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అవార్డుకు ఎంపికైన విషయం విధితమే. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో మంగళవారం నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో సర్పంచ్ ఉత్తమ అవార్డును అందుకున్నారు. ఈసందర్భంగా సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామ ప్రజల సహకారంతో అభివృద్ధి సాధిస్తున్నట్లు తెలిపారు. మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, పంచాయితీ కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దశక్కర్గ వాసికి వైదిక పురోహిత నంది అవార్డు



అవార్డు అందుకుంటున్న రామేశ్వరస్వామి

మద్నూర్(జుక్కల్): మండలంలోని పెద్ద శక్కర్గ గ్రామానికి చెందిన జంగమ రామేశ్వరస్వామికి మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో వైదిక పురోహిత విభూషణ్ రత్న నంది అవార్డు అందుకున్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శ్రీ తినయన సాంస్కృతిక కళా నిలయం సాంస్కృతిక సేవాసంస్థ ఆధ్వర్యంలో వేద పండితులకు, జ్యోతిష్య వాస్తు పండితులకు, సంగీత కళాకారులకు, పలు రంగాలలో నిష్ణాతులను ఎంపిక చేసి వారికి అవార్డులను అందించారు. ఈ సందర్భంగా పెద్ద శక్కర్గాకు చెందిన పురోహితుడు రామేశ్వరస్వామి ఎంపిక కావడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

క్రైం కార్నర్

గంజాయి పట్టివేత



నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ నుంచి పిప్రి వెళ్లే మార్గంలో మంగళవారం సునీల్ రోహిదాస్ వాకుడే అనే వ్యక్తి నుంచి గంజాయి పట్టుకున్నట్లు ఆర్మూర్ ఎక్సైజ్ సీఐ స్టీఫెన్‌సన్ తెలిపారు. సునీల్ పల్సర్ బైక్‌పై 156 గ్రాములు గంజాయి తీసుకువెళుతుండగా, గస్తీ నిర్వహిస్తున్న సమయంలో పట్టుకున్నట్లు పేర్కొన్నారు. కాగ గంజాయిని, బైక్ స్వాధీనం చేసుకొని అతడిని కోర్టులో హాజరుపర్చామన్నారు. గంజాయి అమ్మినా, కొన్న, సేవించిన, నిల్వ ఉంచిన ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం నేరమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి పట్టివేతలో ఎక్సైజ్ ఎస్సైలు గంగాధర్, ప్రమోద్, చైతన్య, చంద్రమౌళి, సిబ్బంది గంగాధర్‌గౌడ్, నారాయణ, ధర్మేంధర్, సాయిబాబా, మోహన్, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

భర్త తన మాట వినడం లేదని ఆత్మహత్య



రేవతి (ఫైల్)

బాల్కొండ: భర్త తన మాట వినడం లేదని మనస్తాపం చెంది భార్య ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ముప్కాల్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై భాస్కరచారి తెలిపిన వివరాలు ఇలా.. మండల కేంద్రానికి చెందిన పన్నీరు రేవతి(37), కిషన్ దంపతులు. సోమవారం కిషన్ తన చెల్లికి రూ.2వేలు పంపడంతో, భర్తతో భార్య గొడవ పడింది. భర్త తన మాట వినకుండ డబ్బులు పంపుతున్నాడని ఆమె మనస్తాపం చెందింది. ఈక్రమంలో మంగళవారం ఉదయం భర్త కిషన్, చిన్నకుమారుడు అభినవ్ వాకింగ్‌కు వెళ్లిన సమయంలో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఇంట్లో ఉన్న పెద్ద కుమారుడు అభినయ్ నిద్రలేచి చూసేసరికి తల్లి ఉరి వేసుకుంది. అతడు తన బాబాయ్ సహాయంతో తల్లిని కిందకు దించి వెంటనే బాల్కొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని అక్కడి వైద్యులు సూచించడంతో పెర్కిట్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందింది. మృతురాలి తండ్రి కమ్మం ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాల్కొండ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

ఒంటరితనం భరించలేక యువకుడు..



సరోజ్ కుమార్ మృతదేహం

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని ఓ రైస్ మిల్లులో లేబర్‌గా పని చేస్తున్న ఓ యువకుడు ఒంటరితనం భరించలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై శ్రీధర్‌రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. మండంలోని గోపన్‌పల్లి గ్రామంలోని వెంకటసాయి రైస్‌మిల్లులో గత కొంతకాలంగా బీహార్‌కు చెందిన యువకుడు సరోజ్ కుమార్ (20) లేబర్‌గా పనిచేస్తుండేవాడు. గత కొన్ని రోజుల నుంచి అతను ఇంటికి దూరంగా ఉన్నానని బాధపడుతూ, తరచూ బీహార్ రాష్ట్రానికి చెందిన ఒక అమ్మాయితో ఫోన్ మాట్లాడుతూ ఉండేవాడు. ఈక్రమంలో సోమవారం రాత్రి రైస్‌మిల్‌లో లేబర్లందరూ భోజనం ముగించుకుని నిద్రిస్తున్న సమయంలో సరోజ్ కుమార్ ఒక తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఒంటరితనంతో బాధపడుతూ ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి అన్న దిలీప్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరు..

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో ఓ వ్యక్తి ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఏఎస్సై గంగారాం తెలిపిన వివరాలు ఇలా.. మండలకేంద్రంలోని దుర్గా నగర్‌కు చెందిన దర్పస్తు శ్రీనివాస్(38) వారంరోజుల పాటు భార్య, పిల్లలతో కలిసి అత్తవారింటికి వెళ్లాడు. మూడు రోజుల క్రితం భార్య పిల్లలను అక్కడే ఉంచి ఒక్కడే గాంధారికి తిరిగి వాచ్చాడు. సోమవారం రాత్రి ఆర్థిక ఇబ్బందులు కారణంగా సొంతింట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం కాలనీ వాసులు గమనించి బంధువులకు సమాచారం ఇచ్చారు. మృతుడి భార్య సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు. కాగా మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

పరీక్షలు సరిగా రాయలేదని విద్యార్థి..



మహేష్ (ఫైల్)

ఖలీల్‌వాడి: డిగ్రీ పరీక్షలు సరిగా రాయలేదని ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నగరంలో మంగళవారం చోటుచేసుకుంది. మూడో టౌన్ ఎస్సై శ్రావణ్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా.. నగరంలోని పంబోలి కాలనీకి చెందిన మహేష్(20) ఓ ప్రయివేట్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ సెకండియర్ చదువుతున్నాడు. ఈక్రమంలో ఇటీవల నిర్వహించిన పరీక్షలను మహేష్ సరిగా రాయలేదు. దీంతో మంగళవారం అతడు ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈమేరకు మృతుడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.